# ప్రజల పక్షాన నిలబడదాం..

- క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు అండగా ఉందాం..
- కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలును క్షుణ్ణంగా గమనిద్దాం..
- బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర


మాట్లాడుతున్న వెంకటవీరయ్య

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 16: ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎన్నికల్లో తమకు ఓట్లు వేసిన ప్రజల కోసం పనిచేద్దామని, వారి పక్షాన నిలబడదామని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు అండగా ఉందామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, హామీల అమలును క్షుణ్ణంగా గమనిద్దామని అన్నారు. ఎక్కడైనా అధికార పార్టీ నాయకులు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే అక్కడ మన కార్యకర్తలకు అండగా నిలబడదామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో, చేపట్టే కార్యక్రమాల్లో లోటుపాట్లు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వెనుకాడవద్దని సూచించారు. నియోజవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సత్తుపల్లిలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా ఉంటానని, ఓటమిలో జరిగిన తప్పులను సరిదిద్దుకుందామని అన్నారు.

**నేడు కందుకూరులో ఆత్మీయ సమావేశం**

సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం వేంసూరు మండలంలోని కందుకూరులో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి సమక్షంలో ఆదివారం జరుగనుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కూసంపూడి మహేశ్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, కసగాని వెంకట్రావు, అక్కినేని సునీల్, వీరమోహన్ రెడ్డి, అశోక్, మట్టా ప్రసాద్, వీరపునేని రాధిక బాబీ, చాంద్‌పాషా పాల్గొన్నారు.

# ఏరియా స్టోర్స్‌లో టీబీజీకేఎస్ ప్రచారం


కొత్తగూడెం ఏరియా స్టోర్స్‌లో ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామవరం, డిసెంబర్ 16: ఏరియా స్టోర్స్‌లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి టీబీజీకేఎస్ బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, యువ ఉద్యోగులు ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ కొన్ని నిర్మాణాత్మకమైన హక్కులను సాధించిందని, ముఖ్యంగా కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు 60 నుంచి 61 సంవత్సరాలకు వయో పరిమితి పెంపు, బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా ప్రమోషన్లు ఇప్పించడం జరిగిందన్నారు. మళ్లీ టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం, నటరాజ్, కూసన నరేందర్, డి.శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

## 'గోపా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి'

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 16: గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాసగౌడ్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 క్యాలెండర్ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలని, మరికొద్ది రోజుల్లోనే సంఘం సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. అసోసియేషన్ బాధ్యులు మరికంటి వెంకటేశ్వర్లు గౌడ్, తొడేటి దుర్గాప్రసాద్ గౌడ్, అలువాల నారాయణ గౌడ్, అనంత కోటేశ్వరరావు గౌడ్, చామకూరి పుల్లయ్య, బాగ్యలక్ష్మి గౌడ్, తిరుపతమ్మ, మార్కం లింగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోపా సంఘం నాయకులు

# 589 పంచాయతీలు.. 5,398 వార్డులు..

- పంచాయతీ ఎన్నికల సిబ్బంది డాటాను పక్కాగా నమోదు చేయాలి
- చిన్న వార్డులకు ఒకటి, పెద్ద వార్డులకు రెండు పోలింగ్ కేంద్రాలు
- పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పది వేల మంది సిబ్బంది అవసరం
- డాటా నమోదు ప్రక్రియ పరిశీలనలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 16: పంచాయతీ ఎన్నికల నిర్వహణ వినియోగించే సిబ్బంది డాటాను పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఐడీవోసీలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సిబ్బంది చేపడుతున్న డాటా నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 589 గ్రామ పంచాయతీలకు గాను 5,398 వార్డులు ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం, పెద్ద వార్డులకు రెండు పోలింగ్ కేంద్రాల అవసరం ఉంటుందని అన్నారు. ఓటర్ల సంఖ్య నిర్ధారణ అయ్యాక పోలింగ్ కేంద్రాల సంఖ్య తెలుస్తుందన్నారు. సుమారు 10 వేల మంది ఎన్నికల సిబ్బంది అవసరం ఉంటుందని, అందరి డాటా నమోదుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డాటా నమోదులో స్కేల్, హోదా, హోమ్‌టౌన్, రెసిడెన్సీటౌన్ సహా అన్ని వివరాలు జాగ్రత్తగా చూడాలని సూచించారు. మండల విద్యాధికారుల సంతకంతో నివేదిక తీసుకోవాలని అన్నారు. డాటా నమోదు పర్యవేక్షణకు అధికారులను నియమించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు హరికిషన్, సోమశేఖరశర్మ, అరుణ, పుల్లారావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

**ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టాలి: కలెక్టర్**

2024 జనవరి 1న ప్రాతిపదికన ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఖమ్మం ఐడీవోసీలో నియోజకవర్గ మాస్టర్ శిక్షకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి శనివారం ఆయన హాజరై.. ఏఈఆర్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు హైదరాబాద్‌లో శిక్షణ పొంది నియోజకవర్గ మాస్టర్ శిక్షకులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వీరు నియోజకవర్గ స్థాయిలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తారని అన్నారు. ఓటర్లకు ఎన్నికల సంబంధ సమాచారం చేరవేతకు వారి మొబైల్ నెంబర్లు సేకరించాలని సూచించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు ముందు 20వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కే.శ్రీరామ్, మదన్‌గోపాల్, రాంబాబు పాల్గొన్నారు.

# క్రీడలు, చదువుకు ముగింపు లేదు..

- క్రీడలు, విద్యలో విజయాలు సాధిస్తూ ముందుకు సాగాలి
- కిన్నెరసాని క్రీడా పోటీల ముగింపులో ఐటీడీఏ పీవో ప్రతీక్
- జిల్లాస్థాయి క్రీడల ఓవరాల్ చాంపియన్ దమ్మపేట డివిజన్


ఓవరాల్ చాంపియన్ దమ్మపేట జట్టుతో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, అధికారులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 16: చదువుకు, క్రీడలకు ముగింపు లేదని, ఎంత చదువుకున్నా తెలుసుకోవల్సినది ఇంకా మిగిలే ఉంటుందని, అదేవిధంగా క్రీడల్లో ఎంత ఉత్తమ ప్రదర్శన చేసినా ఇంకా ప్రతిభ చూపేది చాలా ఉంటుందని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మండలంలోని కిన్నెరసాని క్రీడా పాఠశాలలో మూడు రోజులపాటు జరిగిన ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. చదువుకుంటూ పోతే తెలుసుకోవల్సిన విజ్ఞానం చాలా మిగిలే ఉంటుందని, క్రీడలు ఆడుతూ పోతే సాధించాల్సిన విజయాలు చాలా మిగిలే ఉంటాయని అన్నారు. అందుకని వాటిల్లో విజయాలు సాధిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి క్రీడలో ప్రతిభ చూపిన 448 క్రీడాకారులను జనవరి మొదటివారం 4, 5, 6 తేదీల్లో కిన్నెరసానిలోనే జరిగే రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. మూడుజులపాటు జరిగిన క్రీడాపోటీల్లో రెండు జిల్లాల్లోని ఏడు జోన్ల నుంచి 674 మంది బాలురు, 641 మంది బాలికలు ఎనిమిది అంశాల పోటీల్లో పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా దమ్మపేట డివిజన్ నిలిచింది. విజేతలకు పీవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, విజయలక్ష్మి, చంద్రమోహన్, నరసింహారావు, రూపాదేవి, జహీరుద్దీన్, తిరుమలరావు, రమణయ్య, మంగతాయారు, బీ.గోపాల్‌రావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, చందూ, వీరూనాయక్, నాగరాజు, భద్రు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో వనమా సమావేశం


బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా

పాల్వంచ, డిసెంబర్ 16: పాత పాల్వంచలోని వనమా నివాసంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు ముగించి ఫలితాలు వెలువడిన తర్వాత మొదటిసారిగా ఆయనను కలిసిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన ముచ్చటించారు. ఎన్నికల్లో జరిగిన తదితర విషయాలపై కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎడవల్లి కృష్ణ, కిలారు నాగేశ్వరరావు, బరపటి వాసు, మడి సరస్వతి, మహిపతి రామలింగం, కాంపెల్లి కనకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి రక్షణకు ప్రాధాన్యమివ్వాలి: కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సింగరేణి పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పాత సంప్రదాయాలను కొనసాగిస్తూ సమావేశాలను నిర్వహించాలని కోరారు. ప్రభుత్వానికి విల్ పవర్, ప్లానింగ్, చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు సాధ్యమేనని అన్నారు. ఆశ, అంగన్‌వాడీ, హమాలీలు, ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పెన్షన్, కొత్త రేషన్‌కార్డులను ప్రారంభించాలని, కౌలు రైతులను పరిగణనలోకి తీసుకొని రైతు స్కీములను అమలు చేయాలని, ప్రతి జిల్లాలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని సూచించారు.







మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616